క్లుప్తంగా

56 మంది రక్తదానం



ఏలేశ్వరంలో రక్తదానం చేస్తున్న యువత

ఏలేశ్వరం: మున్సిపల్ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 56 మంది రక్తదానం చేశారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు అన్నదానం చేశారు. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, పెంద్ర శ్రీను, కోనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సప్తాహ మహోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



సిరిపురంలో ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు. ఏటా ఈ వేడుకల్లో భాగంగా సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తారు. కాగా శనివారం ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పంచమ సప్తాహ మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా అనపర్తి వెంకటకృష్ణంరాజు, కామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మండపారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా ఏకాహ మహోత్సవానికి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిబిరిశెట్టి ఆదినారాయణ, తిబిరిశెట్టి సూరిబాబు, అనపర్తి భాను, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి తీరని లోటు



తునిలో ఎమ్మెల్సీ సాబ్జీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

తుని: పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి కార్మికులకు తీరని లోటు అని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రావతి అన్నారు. తుని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సాబ్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మిక సంఘాలకు వెన్నుదన్నుగా ఉండే సాబ్జీ ఆకాల మరణం పొందడం బాధాకరమన్నారు. అంగన్‌వాడీ సంఘ నాయకులు ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఉమా మహేశ్వరి, షకీలా భాను, మహాలక్ష్మి, సూజాత, రమాదేవి, లలితా కుమారి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ బుచ్చియ్యపేటకు చెందిన కొయ్యా చినఅప్పారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కాగా ఆయన కుటుంబ సభ్యులను శనివారం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. పార్టీ నాయకుడిగా కొయ్యా చినఅప్పారావు ఎంతో ఉత్సాహంగా పని చేసేవారని, ఆయన అకాల మరణం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, నాయకులు అంబుజాలపు చిన సత్యనారాయణ, అంబుజాలపు కొండబాబు, యాదాల గోపి, డీలర్ శ్రీను తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఆందోళనలు

శంఖవరం/ప్రత్తిపాడు/గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రౌతులపూడి, శంఖవరం మండలాల అంగన్‌వాడీ సిబ్బంది ఐదో రోజు శనివారం మౌన దీక్ష చేపట్టారు. ప్రత్తిపాడులో దీక్ష శిబిరాన్ని పలువురు నాయకులు సందర్శించారు.

పోలవరం నిర్వాసితుల దీక్ష

గోకవరం: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీ వాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగిస్తామని నిర్వాసితులు తెలిపారు. దీక్షా శిబిరాన్ని జనసేన, టీడీపీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

కూరగ కుధరడం లేదు

- కొండెక్కిన కూరగాయల ధరలు
- కార్తిక మాసం ముగిసినా తగ్గని వైనం
- ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు



మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన కూరగాయలు

కోటనందూరు: కూరగాయల ధరలు కొండెక్కాయి. కార్తిక మాసం ముగిసినా ఏ మాత్రం ధరలు తగ్గలేదు. పెరిగిన ధరలతో కూరగాయలు కొనలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు రోజుకు ఒకపూటే కూర వండుకొని సరిపెట్టేసుకుంటున్నారు. గతంలో రూ.200 పెడితే కుటుంబ సమేతంగా వారం రోజుల పాటు సరిపోయే కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.600 వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉల్లితో పాటు అన్ని కూరగాయల ధరలు కేజీ రూ.60 పైమాటే పలుకుతున్నాయి. ఇప్పుడున్న కూరగాయల ధరలతో ఏం కొనలేం..ఏం తినలేం అన్నట్లుగా పరిస్థితి ఉందని మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజలు కూరగాయలు కొనేందుకు బెంబేలెత్తిపోతున్నారు.

220 హెక్టార్లలో..

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 220 హెక్టార్లలో రైతులు కూరగాయలు పండిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడి పడిపోయింది. దీంతో కూరగాయలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. రైతులతో పాటు ఇతర వర్గాల వారు కూడా మార్కెట్‌లో కూరగాయలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల ధరలు భారీగా ఉన్నాయి. మళ్లీ పంటలు పండించే వరకూ కూరగాయల ధరలు తగ్గే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు.

మార్కెట్లో కూరగాయల ధరల వివరాలు

కూరగాయ పేరు	పాత ధర(కిలో)	ప్రస్తుత ధర(కిలో)
ఉల్లిపాయలు	రూ.30	రూ.80
పచ్చిమిర్చి	రూ.30	రూ.50
బంగాళదుంపలు	రూ.20	రూ.40
బెండకాయలు	రూ.20	రూ.60
వంకాయ	రూ.20	రూ.80
చిక్కుడుకాయలు	రూ.40	రూ.120
క్యాప్సికం	రూ.50	రూ.100
దొండకాయలు	రూ.30	రూ.50
బీరకాయలు రూ.40	రూ.80	
క్యాబేజీ	రూ.30	రూ.50
టమాటా	రూ.30	రూ.50

వ్యాపారులకూ తప్పని అవస్థలు

కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో హోల్ సేల్, రిటైల్ వ్యాపారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. కూరగాయల ఖరీదుకు భారీ మొత్తంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో భారీ ధర చెల్లించినా అవసరమైన కూరగాయలు దొరకడం లేదని చెబుతున్నారు. గతంలో బస్తాల్లో కొనుగోలు చేసే కూరగాయలు ఇప్పుడు సంచులతో సరిపెడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ధరలు పెరుగుదల, కూరగాయల కొరత కారణంగా వ్యాపారాలు భారీగా పడిపోయాయని వాపోతున్నారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి

అన్ని కూరల్లో విధిగా వినియోగించే ఉల్లిపాయల ధరలు వినియోగదారులకు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మార్కెట్లో నాశిరకం ఉల్లి రూ.50 కాగా నాణ్యమైన ఉల్లి రూ.80 వరకూ పలుతోంది. ఉల్లి రేటు విని వినియోగదారులు సొమ్మసిల్లిపోతున్నారు.

ధరలు భారీగా పెరిగాయి



మార్కెట్లో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రతీది కేజీ రూ.50 పైమాటే. మార్కెట్‌కు వెళ్తే కనీసం రూ.500 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.
– రామకృష్ణ, వినియోగదారుడు, కోటనందూరు

జీయన్న మఠంలో ప్రత్యేక పూజలు



ఉత్తరకంచిలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

గండేపల్లి: తాళ్లూరు జీయన్న మఠంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదానం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అన్నదానం నిర్వహించారు. తొలుత పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరకంచి పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించి అన్న ప్రసాదం స్వీకరించారు.

వరుస దొంగతనాలతో బెంబేలు



ప్రత్తిపాడులో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై పవన్‌కుమార్. దొంగలు తెరిచిన బీరువా (ఇన్‌సెట్‌లో)

ప్రత్తిపాడు: గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న కొత్తపేటవీధిలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొత్తపేటవీధిలోని ముక్కా స్వామి ఇంటిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రాజఒమ్మంగి మండలం దూసరపాము గ్రామానికి చెందిన ముక్కా స్వామి ప్రత్తిపాడు మండలం లంపకలోవ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈయన ప్రత్తిపాడులో నివాసం ఉంటూ, శుక్రవారం ఇంటికి తాళం వేసుకుని, ఆయన స్వగ్రామం వెళ్లాడు. ఇంటిలో ఎవరు లేరని నిర్ధారించుకున్న అగంతకులు తాళాలు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా బద్దలు కొట్టి, దుస్తులు తదితర సామగ్రి చిందరవందరగా పడేశారు. లాకరు తెరిచేందుకు విఫలయత్నం చేశారు. లాకరు తెరుచుకోకపోవడంతో కొద్ది మొత్తంలో ఉన్న నగదును దోచుకున్నారు. ఈ ఇంటికి సమీపంలో ఉన్న కిరాణా షాపు తాళాలు బద్దలు కొట్టి, కొద్దిపాటి నగదును తీసుకుపోయారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా ఇటీవల ఈ ఇంటికి సమీపంలోని ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు పడి, సుమారు రూ.15 లక్షల విలువ చేసే నగదు, నగలు దోచుకున్నారు. మరో మూడు ఇళ్లలో వంట గ్యాస్ సిలిండర్లు, డీసీసీబీ బ్యాంకు సమీపంలో ఇద్దరి ఇళ్లలో నిలిపిఉంచిన రెండు మోటారు సైకిళ్లు కూడా చోరీకి గురయ్యాయి. ఈ చోరీలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా చోరీలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



తుని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుడికి బహుమతి అందజేస్తున్న అధికారులు

తుని: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని తుని–నర్సీపట్నం, కోటనందూరు–రౌతులపూడి, శంఖవరం రూట్లలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన పలువురికి బహుమతులు అందజేసినట్టు డిపో మేనేజర్ కె.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్యను ప్రోత్సహించేందుకు గిఫ్ట్ స్కీంను ప్రవేశపెట్టామన్నారు. రెండు విడతల్లో తీసిన లక్కీ డ్రాలో ఆరుగురిని ఎంపిక చేసి, తుని ఉమాశంకర్ వస్త్రలత సౌజన్యంతో శనివారం బహుమతులు ఇచ్చారు. గిఫ్ట్ స్కీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: ధాన్యం కొనుగోలులో అవకతవకలు జరిగాయని రైతుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వీఏఏ, వీఆర్ఓ, టెక్నికల్ అసిస్టెంట్లకు ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వర్షాలకు తడిసి ముక్కైన, రంగుమారిన ధాన్యం కొనుగోలులో విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ధాన్యం నమూనాల సేకరణ, రవాణా, తేమశాతం తదితర విషయాల్లో బయట వారి ప్రమేయం ఉండకూడదన్నారు. రైసు మిల్లర్లతో సమన్వయంగా ఉండి రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తహసీల్దార్ కుశరాజు మాట్లాడుతూ ఆర్బీకేల్లో సంచుల కొరత ఏర్పడితే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. సివిల్ సప్లయి ఏటీఎం విజయ్‌రాజు, టెక్నీషియన్ కిషోర్ ధాన్యం కొనుగోలు విధివిధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఏబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది



సత్యదేవుని సన్నిధిలో కేంద్రమంత్రి సోంపర్కాష్ కు స్వాగతం పలుకుతున్న అర్చకులు



ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వివేది దంపతులకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది సతీసమేతంగా శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాన్ని ఈఓ శ్రీనివాసమూర్తి అందజేశారు. వారి వెంట శంఖవరం ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

సత్యదేవుని దర్శించిన కేంద్రమంత్రి

అన్నవరం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సోం పర్కాష్ శనివారం రాత్రి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

కొండపోడు భూములకు పట్టాల పంపిణీ

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో రైతులు సాగు చేసుకున్న కొండ పోడు భూములకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 108 మందికి కొండపోడు పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చొరవతో కొండపోడు రైతులకు పట్టాలు పంపిణీ చేసినట్టు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్రా రమణమ్మ, పార్టీ నాయకులు చిట్రా రెడ్డి, నరహరిశెట్టి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు సత్వర న్యాయం



తునిలో విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

తుని: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కార వేదికతో అర్జీదారులకు సత్వర న్యాయం జరుగుతుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. తుని వీరవరపుపేట సబ్‌స్టేషన్ ఆవరణలో శనివారం ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, లేకుంటే సంబంధిత అధికారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసి వినియోగదారుడికి పరిహారంగా అందిస్తామన్నారు. తుని సబ్ డివిజన్ పరిధిలో 8 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గతంలో ఇచ్చిన మూడు ఫిర్యాదులపై వినియోగదారులు, అధికారులతో చర్చించారు. వినియోగదారులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎస్.హరిబాబు, వి.జనార్దనరావు, ట్రాన్స్‌కో టెక్నికల్ విభాగం ఈఈ పి.ఉషారాణి, ఏడీఈ జి.శ్రీనివాసరావు, ఏఈలు రమణ, ప్రసాద్, శ్రీనివాసరావు, లోవరాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జగ్గంపేట: మండల రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జగ్గంపేటలో శనివారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా మారిశెట్టి వీరభద్రరావు, ఉపాధ్యక్షుడిగా వై.నారాయణరావు, కార్యదర్శిగా డీవీ రాఘవరాజు, ట్రెజరర్‌గా పెండెం జయరాంలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ ప్లాజా నుంచి అన్నవరం వైపు కె.శ్రీనివాసరావు బైక్‌పై వెళ్తున్నాడు. స్థానిక పుత్ర చెరువు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద అదే మార్గంలో వెనక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

గోకవరం: స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో శనివారం ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు డేనియల్‌బాబ్ పర్యవేక్షణలో సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ చినవీర్రాజు, అధ్యక్షుడిగా కత్తుల వీర్రాజు, ప్రధాన కార్యదర్శిగా కారం కుమారి, ఆర్థిక కార్యదర్శిగా కె.రామచంద్రుడు, మహిళా కార్యదర్శిగా ఆర్.కృష్ణవేణి, ఇతర సభ్యులుగా సీహెచ్ రాజ్‌కుమార్, కె.రామకృష్ణ, రమణశర్మ ఎన్నికయ్యారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి మండల ఎస్టీయూ శాఖ సంతాపం తెలిపింది. సంఘ సభ్యులు షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రమాదాలకు నిలయంగా చిన్నింపేట జంక్షన్



హైవేపై ప్రమాదకరంగా ఉన్న చిన్నింపేట జంక్షన్

ఏలేశ్వరం: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని చిన్నింపేట జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ జంక్షన్ మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. సిరిపురం నుంచి వచ్చే వాహనాలు మలుపు తిరిగేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో బస్టాండ్ నిర్మించాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. కాగా ప్రమాదాల సమయంలో జంక్షన్ వద్ద వీధి దీపాలు ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ గార్డును నియమిస్తామని ప్రకటిస్తున్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సొసైటీలో అవకతవకలపై రేపటి నుంచి విచారణ

ప్రత్తిపాడు: కిర్లంపూడి వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై ఈ నెల 18వ తేదీ నుంచి సెక్షన్ 51 ప్రకారం విచారణ చేపట్టనున్నట్టు పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి, సెక్షన్ 51 విచారణ అధికారి కె.పద్మ తెలిపారు. విచారణలో భాగంగా సొసైటీ సభ్యుల అప్పుల బకాయిల నిర్ధారణ విషయంలో అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా వాగ్మూలం తీసుకుంటామన్నారు. కిర్లంపూడి సొసైటీ పరిధిలోని రుణ గ్రహీతలందరూ నిర్ణయించిన తేదీకి విచారణకు హాజరు కావాలని కోరారు. సదరు అప్పుల జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రత్తిపాడులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి విచారణ జరుగుతుందని చెప్పారు. ఈ నెల 18న సొసైటీ పరిధిలోని చిల్లంగి, జగపతినగరం గ్రామాల సభ్యులకు, 19న సింహాద్రిపురం, కృష్ణవరం, 20న వేలంక, 21న బూరుగుపూడి, సోమవరం, 22న సొసైటీ పరిధిలోని ఇతర గ్రామాల సభ్యులు, 27 నుంచి 29 వరకు కిర్లంపూడి గ్రామానికి చెందిన సొసైటీ సభ్యులు విచారణకు హాజరు కావాలని కోరారు.

రత్నగిరికి మెట్ల పండగ శోభ



సత్యదేవుని పాదాల మండపం వద్ద చేసిన పుష్పాలంకరణ



పల్లకీలో సత్యదేవుడు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితుడు



స్వామివారి పల్లకీ మోస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు

అన్నవరం: రత్నగిరిపై శనివారం సత్యదేవుని మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మెట్ల మార్గాన్ని సుందరంగా అలంకరించారు. స్వామివారి తొలిపావంచా వద్ద, పాదాల మండపానికి చేసిన చేసిన పుష్పాలంకరణ అందరినీ అలరించింది. మెట్లోత్సవం ముగిసాక కూడా పెద్ద సంఖ్యలో మహిళలు మెట్లకు పసుపు, కుంకుమ రాస్తూ ఆలయానికి చేరుకున్నారు. సత్యదేవుని ప్రధానాలయం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. మార్గంమధ్యలో మహిళలు మంచినీరు సరఫరా చేశారు. అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, పలువురు భక్తులు భక్తితో కొంతసేపు స్వామివారి పల్లకీని మోసారు.

వైభవంగా గౌరీదేవి ఉత్సవాలు



కిర్లంపూడిలో గౌరీదేవికి సారె సమర్పిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, భక్తులు

ప్రత్తిపాడు: కిర్లంపూడి యల్లపు వారి వీధిలో శనివారం గౌరీదేవి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. భక్తులు పలురకాల వంటకాలు, మిఠాయిలు, పండ్లు తదితర నైవేద్యాలు (అమ్మవారికి సారె) శిరస్సున ధరించి పుర ప్రదర్శన చేశారు. రమణయ్య పేట, శరకణం వారి వీధి, ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్, నూకాలమ్మ అమ్మవారి ఆలయం మీదుగా తిరిగి యల్లపువారి వీధిలోని గౌరీదేవి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అమ్మవారికి సారె సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా గౌరీ సంఘం అధ్యక్షుడు పెంటకోట శ్రీరాములు, యంగ్‌మెన్స్ క్లబ్ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, గౌరీ సంఘ ప్రతినిధులు ఆదారి సోమేశ్వరరావు, శరకణం భద్రం, రాపేటి సుబ్బారావు, కాళ్ళ సూరిబాబు, వెలగా వెంకటరమణ, కర్రి వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎంసీఏ ఆధ్వర్యంలో క్రిస్మస్ పాటలు, క్విజ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ పాటలు, క్విజ్ పోటీలు (రాత రూపంలో) నిర్వహిస్తున్నట్లు శాఖ అధ్యక్షుడు హెన్రీ, కార్యదర్శి గాంధీ శనివారం తెలిపారు. స్థానిక రామారావు పేటలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 30 ఏళ్ల లోపు వారు ఈ పోటీలకు అర్హులన్నారు. వివరాలకు 95358 68625 నంబర్లలో సంప్రదించాలన్నారు.